క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

ఘన నివాళి



ముత్తుకూరు(పొదలకూరు) : మండలంలోని పొట్టెంపాడుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పల్లంరెడ్డి జనార్దన్‌రెడ్డి సతీమణి విజిత మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె భౌతికకాయానికి మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాళుర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఉచిత పశు వైద్యశిబిరం

వెంకటాచలం: మండలంలోని కురిచెర్లపాడులో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మండవ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండవ ఫౌండేషన్ వైద్యుడు శ్రీనివాసులునాయుడు, కనుపూరు పశువైద్యశాల వైద్యాధికారి మంజునాథ్‌సింగ్ పరీక్షలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందును తాగించారు. పశు పోషణలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిబ్బంది శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సులభరీతిలో విద్యాబోధన



కోవూరు: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకునేలా బోధన సాగించాలని ఎస్ఎస్ఏ ఏఎంఓ సుధీర్‌బాబు ఉపాధ్యాయులకు సూచించారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. క్లస్టర్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని బోధనలో నూతన పద్ధతులు, సాంకేతికతలను పరస్పరం పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పి.శ్రీహరి, డాక్టర్ అలీ, సోఫియా కిరణ్మయి, డైట్ ప్రభుత్వ జిల్లా శిక్షణా సంస్థ సీనియర్ ఉపన్యాసకులు రాధారాణి, ఏఎస్వీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



కోవూరు: విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయ ఆవరణలో ఆయన సీఐటీయూ పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ వేలాది మంది కార్మికులు రెగ్యులరైజేషన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. గతంలో విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, వార్షిక సెలవులు అందిస్తామని ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ప్రభుత్వం మోసపూరిత ధోరణి కొనసాగిస్తే, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిరసనలు, ర్యాలీలు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక రవాణాపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బయ్య

కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక రవాణాకు సంబంధించి శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ ద్వారా మాత్రమే ఇసుక తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ గోపిరెడ్డి, డీటీ బషీర్, ఇసుక ట్రాక్టర్ల యజమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కాలిపోయిన టీవీలు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు సచివాలయ సమీపంలో పిడుగుపాటు ప్రభావానికి గ్రామంలోని టీవీలు, ఇన్వర్టర్లు, ఫ్యాన్లు శనివారం మధ్యాహ్నం కాలిపోయాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మూడు రోజులుగా కురుస్తోంది. దీంతో తరచూ పిడుగులు పడుతుండటంతో జనాలు భీతిల్లుతున్నారు.

పోస్టాఫీస్ అద్దెకు నిధులు

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని పోస్టాఫీస్ భవన రిపేర్ల సమయంలో కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహించేందుకు రూ.రెండు లక్షల నిధులను మంజూరు చేశారు. పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతుల కోసం రూ.28 లక్షలను మంజూరు చేసిన విషయం విదితమే.

బిక్కుబిక్కుమంటూ ప్రయాణం

జాతీయ రహదారి నుంచి మండలంలోని నాయుడుపాళెం మీదుగా అల్లూరు రోడ్డులోని గుండాలమ్మపాళెం చేరుకునే లింకు రోడ్డు పూర్తిగా ఛిద్రమై ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గం గుండా వెళ్తే పలు మండలాల్లోని అనేక గ్రామాలకు మూడు కి.మీ దూరం తగ్గుతుంది. ప్రస్తుతం ద్విచక్ర వాహనదారులైతే ప్రాణసంకటంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణం మానుకున్నారు. రైతులు మాత్రమే గత్యంతరం లేక ధాన్యాన్ని బిక్కుబిక్కుమంటూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

- ఛిద్రమైన నాయుడుపాళెం లింక్ రోడ్డు
- ఆశలు వదులుకున్న వాహనదారులు
- గత్యంతరం లేక భయంభయంగా రైతులు ధాన్యం తరలింపు
- మూడు కి.మీలలో చేరే గ్రామాలకు ఆరు కి.మీ ప్రయాణం



మట్టి రోడ్డును తలపిస్తూ..



రోడ్డు కోసుకుపోయి ప్రమాదభరితంగా మారిన నాయుడుపాళెం లింక్ రోడ్డు

కొడవలూరు: కావలి వైపు నుంచి వచ్చే వారు నాయుడుపాళెం మీదుగా అల్లూరు రోడ్డుకు కేవలం 3 కి.మీ ప్రయాణంతో చేరుకోవచ్చు. ఈ రోడ్డు లేదంటే నార్తురాజుపాళెం వెళ్లి అక్కడి నుంచి కొడవలూరు రైల్వేగేటు దాటుకొని కొడవలూరు మీదుగా 6 కి.మీ ప్రయాణించి గుండాలమ్మపాళెం వద్దకు చేరుకోవాలి. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డును పాలకులు పట్టించుకోకపోవడంతో ఛిద్రంగా మారింది.

నిరంతర రాకపోకలు

కొడవలూరు మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, వెంకన్నపురం, పద్మనాభసత్రం, తలమంచి, దామేగుంట, విడవలూరు మండలం రామతీర్థం రోడ్డు వెంబడి వావిళ్ల, చౌకచర్ల, దండిగుంట, గాదెలదిన్నె, మత్స్యకార గ్రామాలు, అల్లూరు మండలంలోని ఆములూరు, మోపూరు తదితర గ్రామాల వారంతా ఈ రోడ్డు మీదుగానే ప్రయాణాలు చేయాలి. అందువల్లే ఈ రోడ్డులో నిరంతరం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.

ఇంతటి ప్రాముఖ్యత గల రోడ్డు దుర్భర స్థితిలో ఉంది. తారురోడ్డు ఆనవాళ్లు కోల్పోయి మట్టిరోడ్డును తలపిస్తోంది. రోడ్డు గుంతలమయంగా మారి ఇరువైపులా కోసుకుపోయి ఉంది. దీనిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై రావడం మానేశారు. దూరమైనప్పటికీ 3 కి.మీ అదనంగా ప్రయాణించి కొడవలూరు మీదుగా వెళ్తున్నారు.

గత్యంతరం లేకే..

ఈ రోడ్డుకిరువైపులా వందల ఎకరాల సాగు భూములున్నాయి. ఇక్కడ పండించిన ధాన్యాన్ని తరలించాలంటే ఈ రోడ్డుపైనే వెళ్లాల్సి ఉంది. రోడ్డు బాగుంటే దీనిపై లారీలతో ధాన్యం తరలించేవారు. ప్రస్తుతం రోడ్డు అత్యంత దుర్భరంగా ఉండడంతో బిక్కుబిక్కుమంటూ ధాన్యాన్ని ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి బంకపలుచగా మారడంతో ధాన్యంతో వెళ్లే ట్రాక్టర్లు పొలాల్లోకి దూసుకెళ్లి తిరగబడిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు ప్రతి వరికోతల సమయంలో జరుగుతూనే ఉన్నాయి.

నాయుడుపాళెం వెళ్లాలన్నా ఇక్కట్లే

నాయుడుపాళెం గ్రామానికి వెళ్లాలంటే ఎటువైపు నుంచి వచ్చినా ఈ రోడ్డుపైనే వెళ్లాలి. దీనిపై భారీ గుంతలు పడి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు. రాత్రి వేళలో ద్విచక్ర వాహనాలతో ఈ రోడ్డు గ్రామానికి పోవాలంటే హడలిపోతున్నారు.

పట్టించుకునే వారు కరువు

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన నాయుడుపాళెం లింక్ రోడ్డును పట్టించుకొనే వారు కరువయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ చూపి రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు. తద్వారా అనేక మంది రైతులు, ప్రజలకు ఊరట కలుగుతుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



నాయుడుపాళెం మార్గంలో ఇలా..



హైవే నుంచి చేరుకునే రోడ్డులో..

కోటి సంతకాలతో ప్రైవేటీకరణను అడ్డుకుందాం



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొడవలూరు: ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి కోటి సంతకాలు చేయడం ద్వారా వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకొందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమటా శేషగిరిరావు కోరారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పించాలని నిర్ణయించడం తెలిసిందే. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నార్తురాజుపాళెంలోని పార్టీ మండల కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం వల్ల పేదలకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. వైద్య కళాశాలలు కార్పొరేట్ గుప్పెట్లోకి చేరుతాయని చెప్పారు. రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. త్వరితగతిన కోటి సంతకాలు పూర్తి చేసి గవర్నర్‌కు సమర్పించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అడపాల మోహనకృష్ణ, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి కొట్టి మల్లికార్జున, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, నాయకులు బండి పెంచలయ్య, ఎం.మల్లికార్జున, కాకి సుమన్, కమలాకర్‌రెడ్డి, పొబ్బ రవి, మహేంద్ర, ప్రసన్నలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులపై అవగాహన



కోవూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పారిశ్రామిక విజిట్ కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరపురం వద్ద ఉన్న విజయ డెయిరీని శనివారం పరిశీలించారు. పాల ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. పాలు సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు జరుగుతున్న ప్రతి దశను నిర్వాహకులు విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి విజిట్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో, ప్రాక్టికల్ జ్ఞానాన్ని పెంపొందించడంలో ఎంతో మేలు చేస్తాయన్నారు.

పార్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని పార్లపల్లి శివాలయ ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కళాశాల జువాలజీ అధ్యాపకుడు ఐఎస్ చక్రపాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై తండ్రీకొడుకుల దాడి

పొదలకూరు: వ్యక్తిపై తండ్రీకొడుకులు దాడి చేసిన ఘటన మండలంలోని తాటిపర్తిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. పొలగిరి నారాయణరెడ్డిపై గ్రామానికి చెందిన వెన్నపూస రాజగోపాల్‌రెడ్డి, ఆయన కుమారుడు కార్తీక్‌రెడ్డి పైపుతో దాడి చేశారు. పొలంలోకి పశువులు వెళ్లాయనే కారణంతో గొడవపడి దాడికి పాల్పడ్డారన్నారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో బాధితుడు చేరారు. కేసు నమోదు చేశారు.

అన్నిరంగాల్లో మహిళల ప్రతిభ



ఇందుకూరుపేట: బాలింతను సత్కరించి దుస్తులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ



కోవూరు: విద్యార్థినులకు బహుమతుల ప్రదానం

- డీఎంహెచ్ఓ సుజాత

ఇందుకూరుపేట: నేటి ఆధునిక యుగంలో లింగ వివక్షకు తావులేదని, మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభ చాటుతున్నారని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీలో సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శనివారం పాల్గొని, మాట్లాడారు. బాలబాలికలను తల్లిదండ్రులతో పాటు అందరూ సమానంగా చూడాలన్నారు. 'ఆడపిల్లలను చదివిద్దాం.. వారి బంగారు భవితకు బాటలు వేద్దాం' అనే నినాదంతో లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఆడపిల్లలను వారికి ఇష్టమైన రంగాల్లో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించి ఉన్నతంగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా సన్మానించారు. వారికి దుస్తులతో పాటు శిశువుకు బేబీకిట్‌ను అందజేశారు. జగదేవిపేట వైద్యాధికారులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్‌రావు, సీహెచ్ఓ జ్యోతి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విజయ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక సమస్యలు

కోవూరు: బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే సమస్యలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ టి.శారద ఉన్నారు. బాలికా దినోత్సవ వారోత్సవాల్లో కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న విద్యార్థినులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమా, ప్రమీలా, సుమిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పొలాలకు బాట ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

కొడవలూరు: కొడవలూరు, గుండాలమ్మపాళెం, నాయుడుపాళెంలలోని పొలాలకు బాట ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల రైతులు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డిని కోరారు. ఈ మేరకు వారు ఆమెకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్థానిక రైతుల పొలాలకు సరైన దారి లేకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం డొంక దారైనా ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. దీనిపై తహసీల్దార్ సమాధానమిస్తూ ఆయా గ్రామాల్లోని పొలాలకు డొంక దారికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశించి ఉన్నారని తెలిపారు. రెండో పంట సాగులో ఉన్నందున బాట ఏర్పాటు చేయడం కుదరలేదన్నారు. దీపావళి తరువాత వీఆర్వోలతో సర్వే చేయించి డొంక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. టి.ప్రవీణ్‌కుమార్, రవీంద్ర, సామియేలు, వినోద్, హరినాథ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఒ.శ్రీనివాసులు, దస్తగిరి, ఆర్.శీనయ్య ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వెంకటాచలం: వీఎస్‌యూలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వెంకటాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకుటూరు వద్ద గల వర్సిటీ ప్రాంగణంలో మొక్కలను శనివారం నాటించిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఎస్‌యూను హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం బాధ్యత వహించాలని కోరారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే అవి పర్యావరణ కాలుష్యానికి గురికాకుండా కాపాడుతాయని బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డు రామచంద్రాపురంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టారు. తొలుత విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే మొక్కలు నాటి సంరక్షించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించాలి

కోవూరు: సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కృషి చేయాలని జిల్లా డీఎల్‌పీఓ డాక్టర్ పి.రమణయ్య అన్నారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'క్లీన్ ఎయిర్' అనే అంశంపై స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత విద్యార్థినులు సైకిల్ ర్యాలీ చేశారు. అనంతరం రమణయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ విజయ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు అశోక్‌కుమార్, పీడీలు సులోచన, సునీత పాల్గొన్నారు.



కోవూరులో..

పర్యావరణాన్ని కాపాడుకుందాం

మనుబోలు: కాలుష్యాన్ని నివారించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ జలజాక్షి పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మనుబోలులో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీని శనివారం నిర్వహించి వాతావరణ కాలుష్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం

పొదలకూరు: స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడారు. ఆత్మ నిర్భర్ భారత్, స్వయం సమృద్ధి భారత్, సంకల్ప్ అభియాన్‌పై వివరించారు. ప్రతి ఇంట్లో స్వదేశీ వస్తువులను వినియోగించాలని పేర్కొన్నారు. మండల ఇన్‌చార్జి మొద్దు శ్రీనివాసులురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల కార్యక్రమాన్ని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మినుము పంటలో అనుసరించాల్సిన మెరుగైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఎల్బీజీ – 904 రకం మినుము విత్తనాలను రైతులకు అందజేశారు. పొదలకూరు ఏడీఏ శివనాయక్, శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, లోకేష్‌బాబు, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా.. బెంబేలు

- భారీగా పెరిగిన రేట్లు
- సామాన్యులు కొనలేని పరిస్థితి
- గతేడాదితో పోలిస్తే 20 శాతం అదనం



బాణసంచాను కొనుగోలు చేస్తున్న పిల్లలు (ఫైల్)

పొదలకూరు : దీపావళి వచ్చిందంటే పిల్లల సంబరాలకు అంతుండదు. పది రోజుల ముందు నుంచే బాణసంచాను పేలుస్తూ ఉత్సాహంగా గడుపుతారు. అయితే ఈ ఏడాది టపాసుల ధరలు భారీగా పెరిగాయి. ఫలితంగా మధ్య తరగతి కుటుంబాల వారు వీటి కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. కంపెనీలు పెంచుతున్నాయి.. మేము విక్రయిస్తున్నామని వ్యాపారులు సమాధానమిస్తున్నారు. పొదలకూరు పట్టణంలో బాణసంచా దుకాణాలను ఆదివారం ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి హంసరెడ్డి కల్యాణ మండపంలో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు మండల స్థాయి అధికారుల కమిటీ సూచించింది. ఇక్కడ పది మంది వ్యాపారులకు తాత్కాలిక లైసెన్స్‌లున్నాయి.

పెరిగింది ఇలా..

బాణసంచా ధరలు ఈ ఏడాది 20 నుంచి 30 శాతం అదనంగా పెరిగాయని వ్యాపారులే వెల్లడించారు. రవాణా, కూలీలు, పన్నులు, అద్దెలు తదితర ఖర్చులను చూసుకొని ధరలను నిర్ణయిస్తామంటున్నారు. కెమికల్స్ ధరలు పెరగడంతో కంపెనీలు పెంచుతున్నాయని తెలుస్తోంది. దీంతో జేబులు గుల్లవుతున్నాయి. కాకరొత్తుల బాక్సు ధర గతేడాది రూ.60 నుంచి రూ.70 ఉండగా, ఇప్పుడు రూ.110 వరకు ఉంది. చిచ్చుబుడ్ల బాక్స్ రూ.300.. భూచక్రాల బాక్స్ ధర రూ.80 ఉండగా ఇప్పుడు రూ.110కు చేరింది. టపాకాయలపై 20 శాతం మేర పెరిగాయి.